

ప్రభుత్వ పనితీరులో ఆర్టీఐ కీలకం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



వివరాలు 6లో

సారధులెవరో!?

కాంగ్రెస్ జిల్లా కార్యవర్గాల భర్తీకి అధిష్ఠానం కసరత్తు



- నేటి నుంచి డీసీసీ అధ్యక్ష పదవులకు దరఖాస్తుల స్వీకరణ
- హనుమకొండకు ఎమ్మెల్యే నాయిని వైపే అధిష్ఠానం మొగ్గు..?
- వరంగల్ డీసీసీకి స్వర్ణతో పాటు మరో నలుగురైదుగురు ఆశావహులు
- జనగామ జిల్లా అధ్యక్ష రేసులో ఝాన్సీరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి
- ములుగు జిల్లా అధ్యక్ష పదవి తెరపైకి పైడాకుల, సూర్య
- భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష పీఠం దక్కేదెవరికో?
- ఎమ్మెల్యేలు, సీనియర్లకు అవకాశం ఇవ్వాలనే యోచనలో అధిష్ఠానం

అధికార కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి మొదలైంది. జిల్లా కమిటీల కార్యవర్గాలను ఎంపిక చేసేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ పడే వారి నుంచి శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో పార్టీ సంస్థాగత ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో పార్టీ పదవులపై నాయకులు ఆశతో ఉన్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలకే డీసీసీ అధ్యక్ష పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం సుముఖంగా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షుల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మరో టర్మ్ కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. మిగతా జిల్లాల్లో కూడా పాత, కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. పార్టీ పదవుల పందేరం ఇప్పుడు కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. శనివారం నుంచి వారంపాటు జిల్లా అధ్యక్ష పదవిని ఆశించే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఏఐసీసీ నుంచి ప్రతీ జిల్లాకు డీసీసీ ఎన్నికల పర్యవేక్షులను నియమించారు. శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లా పార్టీ సమావేశాలను డీసీసీ భవన్‌లో నిర్వహిస్తున్నారు. సోమవారం భూపాలపల్లి పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్ష పదవిని ఆశించేవారు తమ దరఖాస్తుతో పాటు పార్టీ వారు చేసిన సేవలు, అనుభవం, గతంలో నిర్వహించిన బాధ్యతలు, తదితర వివరాలతో స్పష్టంగా పేర్కొంటూ ఏసీసీఐ పర్యవేక్షకులకు ఇవ్వాలని అధిష్ఠానం సూచించింది. దీంతో డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించే నేతలు దరఖాస్తులు సిద్ధం చేసుకుంటున్నారు.

హనుమకొండ నాయినికేనా..

ఉమ్మడి జిల్లాకు కేంద్రంగా ఉన్న హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవి కాంగ్రెస్‌కు కీలకంగా మారింది. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు హనుమకొండలో కీలకమైన నేత చేతిలో డీసీసీ పగ్గాలు ఉంచాలని అధిష్ఠానం భావిస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డికి ఇటీవలే టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా పార్టీ నియమించింది. అయితే తనకు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కావాలని నాయిని అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. కులాల సమీకరణలో నాయిని ఉపాధ్యక్ష పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే డీసీసీ అధ్యక్ష పదవిని వేరే వాళ్లకు అప్పగించాలని నాయిని పీసీసీ అధ్యక్షుడికి లేఖ కూడా రాశారు. దీంతో హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవిపై కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జంగా రాఘవరెడ్డి, దొమ్మాటి సాంబయ్యతో పాటు మరో నలుగురైదుగురు నజర్ వేసినట్లుగా ప్రచారం జరిగింది. అయితే అధిష్ఠానం మరోసారి డీసీసీ అధ్యక్ష పదవిని నాయిని రాజేందర్ రెడ్డికి అప్పగించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాలకు బలంగా కౌంటర్ ఇస్తుండటంతో పాటు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉండటంతో నాయిని వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతోందనే ప్రచారం జరుగుతోంది. జడ్పీ చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వుడు కావటంతో దొమ్మాటి సాంబయ్య కూతురు మౌనికకు దాదాపు ఖరారైందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో నాయిని అధ్యక్ష పదవి చేపట్టేందుకు ఆయిష్టత చూపిస్తే రెడ్డి సామాజిక వర్గం నుంచి మరొకరికి అవకాశం ఇస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఇక వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి చేపట్టేందుకు ఎర్రబెల్లి స్వర్ణ సుముఖంగా ఉన్నారనే ప్రచారం ఉంది. అయితే వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. తమ అనుచరులను బరిలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది. మంత్రి కొండా దంపతులు తమ అనుచరులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు ముగ్గురు పేర్లను అధిష్ఠానం



(మిగతా 7లో..)

దివ్యాంగులకు చేయూతగా న్యాయసేవాధికార సంస్థ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్.రమేష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్. రమేష్‌బాబు

కృష్ణకాలనీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్. రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడతూ గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడినవారు, వ్యసనాలకు అలవాటుపడిన వారు, నేరాలకు పాల్పడేవారిలో చాలా మంది మానసిక ఆరోగ్యం సరిగ్గా లేకనే చెడు వ్యసనాలకు బానిసలవుతారన్నారు. దివ్యాం గులకు ఎలాంటి సహాయం కావాలన్నా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఎ. నాగరాజ్, జూనియర్ సివిల్ జడ్జీ దిలీప్‌కుమార్ నాయక్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాసచారి, గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల భిక్షపతి ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

మేడారంలో ఈ - హుండీ ఏర్పాటు



ఈ - హుండీ ఏర్పాటు చేస్తున్న పూజారులు, అధికారులు

తాడ్వాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దేవస్థానంలో తల్లుల గద్దెలపై భక్తులకు డిజిటల్ కానుకలు సమర్పించేందుకు గాను ఈ హుండీలను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాడ్వాయి కెనరా బ్యాంక్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ వారి బ్యాంకు సహకారంతో వనదేవతల భక్తులకు ఈ హుండీ సేవలను పూజారుల చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే భక్తులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య, దేవాదాయ శాఖ అధికారులు జగదీష్, మధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలం.. పుష్కలం

- ఉప్పొంగుతున్న బోరుబావులు, చేతిపంపులు
- పర్యాటకులకు కనువిందు
- పంటలకు సమృద్ధిగా సాగునీరు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

వివరాలు 6వ పేజీలో

తొలగని ముసుగు

కాటారం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల విషయమై హైకోర్టు స్టే విధించడంతో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ను వాయిదా వేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసి ఎన్నికల కోడ్‌ను తొలగించిన రాజకీయ నాయకుల విగ్రహాలకు ఇంకా ముసుగు తొలగలేదు. గురువారం రాత్రి నుంచే కోడ్ ముగిసినా శుక్రవారం సైతం విగ్రహాలకు ముసుగు తొలగకపోవడం గమనార్హం. మండల పరిషత్ కార్యాలయంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు విగ్రహానికి ముసుగు, చిల్డ్రెన్స్ పార్క్ బోర్డుకు కట్టిన బట్టను తొలగించలేదు.



శ్రీపాదరావు విగ్రహానికి తొలగించని ముసుగు

రామప్పలో కొనసాగుతున్న హెరిటేజ్ క్యాంపు

వివరాలు 6లో



సింగరేణి సిగలో.. మహిళా శక్తి

- నానాటికి పెరుగుతున్న నారీమణుల సంఖ్య
- వివిధ విభాగాల్లో విధుల నిర్వహణ
- గనులు, రెస్క్యూ, సెక్యూరిటీ ఇతర వింగ్‌లలో రాణింపు
- తాజాగా డంపర్ ఆపరేటర్లకు సైతం దరఖాస్తుల ఆహ్వానం
- ఎన్నడూలేని విధంగా హెవీ వెహికిల్స్ నడిపేందుకు అవకాశం
- భూపాలపల్లి ఏరియాలో 206 మంది మహిళా ఉద్యోగులు

కృష్ణకాలనీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరి వెలుగు విరజిమ్మే.. సింగరేణి బంగారం.. అణువణువునా ఖనిజాలు.. నీ తనువుకు సింగారం.. అనే పదాలు రాష్ట్ర గీతంలో సింగరేణి ఔన్నత్యాన్ని తెల్పి చెప్పేవి. ఇప్పుడు ఆ వైభవానికి మహిళా శక్తి మరింత వెలుగు నింపుతోంది. ఎంతోమంది కార్మికులకు నెలవుగా ఉన్న సింగరేణి సంస్థలో పురుషుల కంటే మేమేం తక్కు వ కాదని పలు వురు మహిళామణులు నిరూపిస్తున్నారు. శారీరక శ్రమతో కూడిన పనుల్లో సత్తా చాటుకుంటూ తాము పురుషులకు ఏ మాత్రం తీసిపోమని రుజువు చేస్తు న్నారు. గతంలో సింగరేణిలో ఉద్యోగాలు పురుషులకే పరిమితమవగా మహిళలకు కూడా ఉద్యోగాల్ని ఇవ్వాలని కొంత మంది కోర్టును ఆశ్రయించగా కోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది. అప్పటి నుండి సింగరేణి లో నానాటికి మహిళామణుల సంఖ్య పెరుగుతోంది. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరుతూ సింగరేణిలో వివిధ విభాగాల్లో రాణిస్తూ వావ్ అనిపించుకుంటున్నారు.

కారుణ్య నియామకాల ద్వారా..

సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందే అవకాశం మహిళలకు లభించింది. అయితే, గతంలో సింగరేణిలో కేవలం కార్మికుల కుమారులకు మాత్రమే అవకాశం ఇచ్చేవారు. హైకోర్టు తీర్పుతో ఇప్పుడు మహిళలకు కూడా అవకాశం కలుగుతుంది. కారుణ్య నియామాల్లో ఉద్యోగాల్లో చేరిన వారు ప్రస్తుతం బదిలీ వర్కర్లు, జనరల్ అసిస్టెంట్లతో పాటు ఆయా ఇతరత్రా ఇన్ని విభాగాల్లో అర్హతను బట్టీ విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో చేరిన వారంతా డిగ్రీలు, పీజీలు చదివిన వారే ఉన్నారు. ఉన్నతమైన చదువులు చదివిన వారు కావడంతో వారివారి అర్హతను బట్టి సింగరేణి అధికారులు కార్యాలయాల్లో సైతం వీరి సేవలను వినియోగించుకుంటున్నారు.

రెస్క్యూ, సెక్యూరిటీలో ముందంజే..

సింగరేణిలో పని చేయడమంటేనే కష్టమనే నానుడి ఉంది. ఏ విభాగమైన (మిగతా 8వ పేజీలో)

ఏరియా మొత్తంగా 206 మంది మహిళలు..

అసిస్టెంట్ ఫోర్‌మెన్	02
బదిలీ వర్కర్లు	53
క్లర్క్	01
ఎలక్ట్రిషియన్ ట్రెయినీ	06
ఫిట్టర్ ట్రెయినీ	08
జనరల్ అసిస్టెంట్లు	58
జూనియన్ మైనింగ్ ఇంజనీరింగ్ ట్రైనీ	02
జూనియర్ కెమిస్ట్	03
జూనియర్ అసిస్టెంట్లు	18
మ్యాట్రిన్	01
ఫార్మసిస్టు	01
సీనియర్ అసిస్టెంట్లు	25
సీనియర్ ఆయా	02
అధికారులు	26
మొత్తం	**206**

చెరువులో స్నానానికి వెళ్లి..

యువకుడు గల్లంతు

తాడ్వాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి వెళ్లి యువకుడు నీట మునిగి గల్లంతైన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన బాసాని రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో రామకృష్ణ అంతిమ యాత్రలో పాల్గొన్న యువకులు ఇర్సవడ్ల వినయ్, రణధీర్, నవీన్‌లతో కలిసి మంకిడి పవన్(25) స్నానం చేయడం కోసం గ్రామ శివారులోని చెరువులోకి దిగారు. అయితే పవన్ ప్రమాదవశాత్తు లోతట్టు ప్రాంతంలో నీట మునిగి గల్లంతయ్యాడు. వెంటనే స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గంటల సమయం పాటు చెరువులో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదని అన్నారు. చికటి కావడంతో గాలింపును అధికారులు నిలిపివేశారు. పవన్ ఆచూకి కోసం కుటుంబ సభ్యులు చెరువు వద్ద రోదిస్తూ ఉన్నారు. కాపలాగా గ్రామ స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



గల్లంతు అయిన యువకుడు మంకిడి పవన్ (ఫైల్)

పిడుగుపాటుతో వ్యక్తి మృతి


సమ్మయ్య మృతదేహం

వెంకటాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలం కొండాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండాపురం గ్రామానికి చెందిన మొర్రం సమ్మయ్య(46) ఉదయం గ్రామ శివారులోకి పశువులను మేపేందుకు వెళ్లాడు. కాగా, సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన సమ్మయ్యను కుటుంబ సభ్యులు చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని భద్రాచలంకు తరలించారు. ఈక్రమంలో ఆయన ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఈనెల 4న కాటువేసిన పాము


రాకేశ్(ఫైల్)

బచ్చన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై, చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బోనకొల్లూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. దయ్యాల పద్మ-శనకయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు రాకేష్ (19) ఉన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన రాకేష్ ప్రస్తుతం వ్యవసాయ పనులు చూసుకుంటూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 4న వ్యవసాయ బావి వద్ద ఏదో కాటు వేసినట్టు అనిపించింది. ఏదో పురుగు అనుకుని పట్టించుకోకుండా అదేరోజు రాత్రి దుర్గామాత నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నాడు. ఇంటికి వచ్చి పడుకున్నాక తెల్లవారుజామున కాలు మొద్దుబారుతోందని కుటుంబ సభ్యులకు తెలపటంతో వారు జనగామ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పాము కరవడం వల్లే మృతి చెందాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చేతి కందివచ్చిన కొడుకు చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. కేసును ఎస్ఐ అబ్దుల్ హమీద్ దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తాడ్వాయి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన పల్నాటి కృష్ణ(26) అనే వ్యక్తి 15 రోజుల క్రితం గడ్డి మందు తాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కృష్ణ భార్య సుమిత కుటుంబ కలహాలతో ఆరు నెలల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో 15రోజుల క్రితం తన అత్త దిడ్డి మల్లమ్మ కృష్ణను గోల్డు లోను కట్టమని డబ్బులు అడిగిందని తెలిపారు. అయితే మనస్తాపం చెందిన కృష్ణ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కాగా కృష్ణకు మూడేళ్ల కుమారుడు ప్రక్షిత్ వర్మ ఉన్నాడు. కృష్ణ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వీధి కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి


మృతి చెందిన మేక పిల్లలు

రఘునాథపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద కొట్టంలో ఉన్న ఏడు మేక పిల్లలపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బడి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. పొట్టిగుబ్బడి తండాకు చెందిన బానోతు జయరాం తన ఇంటి వద్ద ఉన్న కొట్టంలో ఏడు మేక పిల్లలను వదిలేసి పెద్ద మేకలను మేపుకరావడానికి బయటకు వెళ్లాడు. ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో మేక పిల్లలపై వీధి కుక్కలు దాడి చేశాయి. మేక పిల్లల విలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుందని బాధితుడు బానోతు జయరాం వాపోయాడు.

భూగర్భ జలం.. పుష్కలం

- ఉప్పొంగుతున్న బోరుబావులు, చేతిపంపులు
- పంటలకు సమృద్ధిగా సాగునీరు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- పర్యాటకులకు కనువిందు


పంట పొలంలో బోరుబావి నుంచి బయటకు వస్తున్న నీరు


మేదారం అడవిలో నీరు ఉబికిపోస్తున్న చేతి పంపు

తాడ్వాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పాతాల గంగ పైపైకి వస్తోంది. ఎండిన బోరుబావులు, చేతి పంపుల నుంచి జలధారలు ఎగసి పడతున్నాయి. ఎండిన బావులకు జలకళ ఉట్టిపడుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో భూగర్భ జలాలు ఉప్పొంగి బోరుబావులు, చేతి పంపులు నీరు ఉబికి పోస్తున్నాయి. ఈ క్రమంలో స్థానికులు, మేడారం వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అధిక సంఖ్యలో బోరుబావులు, చేతిపంపులు ఉబికి పోయడంతో పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎలాంటి విద్యుత్ లేకుండా, చేతిపంపులను కొట్టకుండా నీరు అధికంగా బయటకు వస్తుండడం పర్యాటకులను కనువిందు చేస్తోంది. మేడారం నుంచి తాడ్వాయికి వచ్చే రహదారి వెంబడి పదుల సంఖ్యలో చేతిపంపులున్నాయి. భూగర్భజ లాలు అధికంగా ఉండడం వల్ల నీరు బయటకు వస్తుందని కొందరు చర్చించుకోగా.. మరికొందరు భూమిలో పీడనం వల్లే నీరు ఉబికి పోస్తున్నాయని అంటున్నారు. గత కొంత కాలంగా ప్రకృతి వింతలు ఈ మండలంలోనే జరుగుతుండడం విశేషం. గత సంవత్సరం రాకాసి గాలులు, భూకంపానికి కేంద్రం, భూ గర్భజలాలు ఎత్తిపోయడం విశేషంగా మారింది.

అధిక వర్షాల కారణంగా తెలంగాణలో భూగర్భ జలాలు సాధరణ స్థాయి కంటే ఎక్కువ పెరిగి అనేక చోట్ల బోరు బావుల నుంచినీరు ఉబికి వస్తున్నాయని విశ్లేషకులు తెలుపుతున్నారు. 2024 సంవత్సరంలో 6.84 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు 2025 సంవత్సరం ఆగస్టు నెల నుంచి 5.78 మీటర్ల లోతుకు చేరాయని అధికారులు తెలుపుతున్నారు. అంతేకాకుండా జల సంరక్షణకు కాళేశ్వరం ప్రాజెక్టుల వంటి నీటి ప్రాజెక్టుల వల్ల కూడా నీరు ఉబికి రావడం సాధ్యమైందని అంటున్నారు. అధిక వర్షాలు కురిసి భూగర్భంలో నీటి టేబుల్ లెవల్‌కు దిగువగా ఉన్న బోరుబావుల్లో కూడా నీరు వాటంతట అవే పైకి రావడం జరుగుతుందటున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండల ంలో అడవి అధికంగా ఉండడం, ఇసుకరాయి వంటి భూ పొరలు ఉన్నాయని అన్నారు. ఈ రాయి పొరలో నీరు నిల్వలు అధికంగా ఉంటాయని తెలిపారు.

సంతోషంగా ఉంది



మండలంలో నీటి లభ్యత అధికంగా ఉండడం సంతోషంగా ఉంది. పంటలు సమృద్ధిగా పండుతాయనే నమ్మకం రైతుల్లో అధికంగా పెరిగింది. అయితే ఈ ప్రకృతి వింతలను అధికారులు గమనించాలి. మానవాళికి ముప్పు జరిగే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అని గుర్తించాలి. ఈ ఏడాది కాలంలో మూడు రకాల విచిత్రాలు జరగడంపై స్థానికుల్లో పలు రకాల ప్రశ్నలు మొదలయ్యాయి.

\- జీడి బాబురావు, రైతు

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

భూమి పొరల ఆధారంగా నీటి నిల్వలు శాతం మారుతుంది. అందులో భాగంగానే తాడ్వాయి మండలంలో కొన్ని ప్రాంతాలలో బోరు బావులు ఉబికి పోస్తున్నాయి. అదేవిధంగా భూగర్భంలో వాటర్ టెబల్‌కు దిగువ ప్రాంతాల్లో నీటి ఊటలు, జల దారలు, బోరుబావులు ఉబికి పోయడం జరుగుతుంది. ఈ ప్రక్రియకు విపత్తులకు సంబంధం ఉండదు.

\- కె.కృష్ణకాంత్, హైడ్రాలజిస్ట్


బొమ్మాపూర్‌లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నీటిని నిల్వ ఉంచొద్దు

ప్రజలకు వైద్యాధికారల సూచన

మహదేవపూర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున గ్రామాల్లో నీటి తొట్టిలు, ఖాళీ ప్రదేశాలు, ఇతర ప్రాంతాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శుక్రవారం డ్రైడే సందర్భంగా ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి, కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సుష్మిత ఆదేశాలతో సబ్ యూనియట్ ఆఫీసర్ రమేష్, కాళేశ్వరం, బ్రాహ్మణపల్లి, బొమ్మాపూర్, అన్నారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ హరిణి, డాక్టర్ వినయ్, డాక్టర్ రమ్య శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నిల్వ నీరు ఉండకుండా చూడాలని సూచించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల లార్వాలు ఉండకుండా ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. కిటికీలకు దోమలు రాకుండా తెరలు వాడాలని తెలిపారు. సెప్టిక్ ట్యాంకులు లీక్ కాకుండా చూడాలన్నారు. దోమల నివారణను అరికట్టవచ్చన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత


బాధితురాలికి నెక్లెస్ అందజేస్తున్న సీఐ

జనగామ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బంగారు నెక్లెస్‌ను క్షణాల వ్యవధిలో జనగామ పోలీసులు బాధితురాలికి అప్పగించారు. జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి కథనం ప్రకారం మండలంలోని మరిగడికి చెందిన పుట్ట శ్రావణ్- అశ్విని దంపతులు మూడు తులాల నెక్లెస్ వంకు తెగిపోవడంతో జనగామలో ఓ జ్యువెలరీ షాపు వచ్చి అతికించుకుంది. తర్వాత హ్యాండ్ బ్యాగులో నెక్లెస్‌ను వేసుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో బ్యాగ్ ఎక్కడోపడిపోయింది. మార్గం మధ్యలో బ్యాగు కనిపించకపోయేసరికి జనగామ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై భరత్, క్రైమ్ కానిస్టేబుల్ బీటీఈ. కరుణకర్ సీసీ కెమెరాల ఆధారంగా బ్యాగును గుర్తించి బాధితురాలికి అప్పగించామన్నారు.

ప్రభుత్వ పనితీరులో ఆర్టీఐ కీలకం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొం దించడంలో సమాచారహక్కు చట్టం కీలకపాత్ర పోషిస్తుందని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమాచార హక్కు చట్టం- 2005 వార్షికోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరిన సమాచారాన్ని నిర్దేశిత వ్యవధిలోగా అందించడం ప్రతి అధికారి బాధ్యతగా భావించాలన్నారు. స్వచ్ఛందంగా ఇవ్వాల్సి సమాచారాన్ని పౌరులకు సులభంగా అందుబాటులో ఉంచే విధంగా వ్యవహరించాలన్నారు. పౌరులకు అందించాల్సిన సమాచారాన్ని సకాలంలో అందించడంతో పాటు పారదర్శకత పాటిస్తూ పనిచేస్తానని అధికారులతో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మీ, ఎస్‌డీసీ రమేష్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సేవలు

సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరపచౌరి



మాట్లాడుతున్న సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరపచౌరి

కృష్ణకాలనీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఉద్యోగుల సీఎంపీఎఫ్ సేవలు అందిస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ చిన్న జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సీఎంపీఎఫ్, పెన్షన్‌కు సంబంధించిన లావాదేవీలు అన్ని సీ-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుపతున్నట్లు తెలిపారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్‌గా సీఎం పీఎఫ్, పెన్షన్‌కి సంబంధించిన క్లైమ్‌లన్ని సెటిల్ చేస్తున్నామని వివరించారు. కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని స్పష్టంచేశారు. ఈ సమీక్షలో జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎం సివిల్ వి. రవికుమార్, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, సీఎంపీఎఫ్ రీజినల్ ఆఫీసు సిబ్బంది, ఇతర పర్సనల్ అధికారులు, అన్ని గనుల సంక్షేమ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రామప్పలో కొనసాగుతున్న హెరిటేజ్ క్యాంపు



శిక్షణలో వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో కాకతీయ వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపు మూడోరోజు శుక్రవారం కొనసాగింది. ఉదయం 40మంది విదేశీయులకు యోగా తరగతులు నిర్వహించగా ప్రొఫెసర్ పాండురంగారావు కాకతీయులపై ప్రజెంటేషన్ అందజేశారు. అదేవిధంగా ప్రొఫెసర్ కె.విజయబాబు కాకతీయ టెంపుల్స్ విశిష్టత గురించి వివరించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమి చైర్మన్ వేదకుమార్ హెరిటేజ్ నిర్వహణ, వాటి గురించి తెలంగాణలోని చరిత్రను ఏ విధంగా వెలికితీయాలి, వాటిని మనం ఏవిధంగా కాపాడుకుని భావితరాలకు అందించాల్సి ఉంటుందనే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేపీ.రావు ఆర్కియాలజికల్ వేషం, పురావస్తు తవ్వకాలు ఏవిధంగా చేస్తారు, ఎక్కడెక్కడ తవ్వకాలు జరిపారు, మన టెంపుల్స్‌ని, మన చరిత్రను ఎప్పుడు ఎన్ని వేలసంవత్సరాల క్రితం ఉన్నదని ఏవిధంగా కనుక్కోవచ్చే అనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. అనంతరం శిక్షణ తీసుకుంటున్న 40మంది వలంటీర్లు రామప్ప టెంపుల్‌పై చిన్న ప్రాజెక్టు ప్రజంటేషన్‌ను ప్రొఫెసర్ పాండురంగారవు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్‌లకు అందజేశారు.

హెప్సీబా నిర్వాహకుల రిమాండ్

పాలకుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : హెప్సీబా పేరుతో అమాయక ప్రజలను మోసం చేసిన నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జానకిరాంరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో మీడియాతో సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లికి చెందిన తిప్పాల సైదులు 2023లో పాలకుర్తికి వచ్చి తన భార్య నారాయణమ్మ పేరిట హెప్సీబా ఫర్మ్ కంపెనీని స్థాపించాడు. ఎలాంటి అనుమతులు లేకుండానే కంపెనీ రిజిష్టర్ చేయించి సైదులు పేరిట 80శాతం పర్సంటేజ్, అతని భార్య పేరిట 20 శాతం పర్సంటేజ్ ఉండేలా నమోదు చేయించాడు.

ప్రజలు డబ్బులు కట్టే విధంగా స్థానికులను ప్రేరేపించారు. స్థానికులు నమ్మి రూ. 10 కోట్లు వరకు పెట్టుబడులు పెట్టారు. తర్వాత లాభాలు రాకపోవడంతో నిర్వాహకులను నిలదీశారు. కొద్ది రోజులుగా నిర్వాహకులు అదృశ్యమయ్యారు. దీంతో మోసపోయామని గ్రహించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మోసాలతో భాగస్వాములైన నారాయణమ్మ, మనుబోతుల శోభ, నాగలక్ష్మిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. 15రోజుల క్రితం సైదులు, అతని ముగ్గురు అల్లుళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7050	5300
మక్కలు	2050	1521
కందులు	5352	3022
పెసళ్లు	4312	3022
పల్లికాయ (సూక)	5900	3500
పల్లికాయ (పచ్చిది)	4100	2400
పసుపు (కాడి)	9869	9016
పసుపు (గోల)	8906	8226
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	13000	12000
యూఎస్341ఏసీ	15800	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

\- వరంగల్ వ్యవసాయం

చార్జీలు పెంచాలంటూ టిప్పర్స్ అసోసియేషన్ సమ్మె

ఏరియాలో బొగ్గు రవాణాకు ఆటంకం


ఆందోళన తెలుపుతున్న టిప్పర్ అసోసియేషన్ సభ్యులు

కృష్ణకాలనీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణాలో చెల్లించే చార్జీలు పెంచాలంటూ టిప్పర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. గతంలో టన్నుకు రూ.82 చెల్లిస్తున్నారని, అవి ఏ మాత్రం సరిపోవడంలేదంటూ సమ్మె బాట పట్టారు. శుక్రవారం నుండి సమ్మె ప్రారంభించి టిప్పర్ లారీలను ఎక్కడికక్కడి నిలిపివేశారు. ఓసీ-2, ఓసీ-3 నుండి కేటీపీపీ చెల్పూరుకు, మరియు ఉప్పల్‌కు కోల్ ట్రాన్స్‌పోర్టింగ్‌కు సంబంధించి ఇస్తున్న పాసింగ్‌లో పాత కిరాయి గిట్టుబాటు కావడం లేదని అసోసియేషన్ అధ్యక్షులు రోడ్డ రవిందర్ వెల్లడించారు. ప్రస్తుతం తమకు ఓసీ-2 నుండి టన్నుకు రూ. 110, ఓసీ-3 నుంచి టన్నుకు రూ.120, అలాగే, ఉప్పల్‌కు టన్నుకు రూ.250 ఇవ్వాలనే డిమాండ్‌తో సమ్మె బాట పట్టామన్నారు. యాజమాన్యం స్పందించేంత వరకు తమ సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

బొగ్గు రవాణాకు అంతరాయం..

భూపాలపల్లి సింగరేణి ఏరియా నుంచి సుమారు 300 లారీలు బొగ్గు రవాణా చేస్తున్నాయి. భూపాలపల్లి ఏరియా నుంచి కేటీపీపీకి 13 వేల టన్నులు, గోదావరిఖనికి 2 వేల టన్నులు, ఉప్పల్‌కు 2 వేల టన్నుల బొగ్గు రవాణా రోజుకు జరుగుతోంది. అయితే, టిప్పర్ అసోసియేషన్ చేపట్టిన సమ్మెతో బొగ్గు రవాణాకు అంతరాయం కలిగింది. ఓసీ-2 నుంచి 3 వేల టన్నులు, ఓసీ-3 నుంచి 2 వేల టన్నులకు అంతరాయం కలిగినట్లు తెలిసింది. కానీ, అధికారులు ధృవీకరించకుండా తమ వద్ద కాంట్రాక్టు కింద నడిచే లారీలతో రవాణా చేశామని అధికారులు చెప్పుకొచ్చారు. కాగా, టిప్పర్ అసోసియేషన్‌తో పాటు ఇతర లారీలన్నింటిని సైతం మద్దతు తీసుకొని సమ్మెకు సహకరించేలా పూర్తి స్థాయిలో రవాణానిలిచిపోయేలా అసోసియేషన్‌లంతా ఏకమవుతున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే ఏరియా నుంచి ఒక్క టన్ను కూడా ఇతర ప్రాంతాలకు రవాణా చేసే అవకాశం ఉండకపోగా సంస్థకు నష్టం వాటిల్లే ప్రమాదం నెలకొంది.

పండుటాకుల పరేషాన్

- నిలిచిన సీనియర్ సిటిజన్ కార్డుల జారీ
- ఆరు నెలలుగా మంజూరుకు సర్కార్ బ్రేక్
- ఇబ్బందులు పడుతున్న వయో వృద్ధులు
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 19,800 కార్డులు
- కార్యాలయాల చుట్టూ వృద్ధుల ప్రదక్షిణ

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ కార్డు(ఎస్‌సీసీ)ల జారీ నిలిచిపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్డుల కోసం జిల్లా వయోవృద్ధులు, స్త్రీశిశు సంక్షేమ కార్యాలయం చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా అయినా కార్డులు పొందుదామనుకున్నా వీలు కావడం లేదు. ఇందుకు సంబంధించిన సైట్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం మూసి వేసింది. 60 సంవత్సరాలు దాటిన పురుషులు, 58 సంవత్సరాలు పైబడిన మహిళలకు సీనియర్ సిటిజన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తుంది. దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్ కార్డు చెల్లుబాటు అవుతుంది. ముదిమి వయసులో కన్న బిడ్డల నుంచి నిరాదరణకు గురైనవారికి, ఎలాంటి ఆధారం లేని అనాథ వృద్ధులకు ఆశ్రమాల్లో సేవలు పొందేందుకూ అవసరం అవుతుంది. దేశవ్యాప్తంగా కార్డుల జారీ కొనసాగుతున్నా రాష్ట్రంలో మాత్రం 6 నెలలుగా నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో కార్డుల సమస్యను పరిష్కరించాలంటూ వృద్ధులు అర్జీలు పెట్టుకున్నారు.

దరఖాస్తులు పెండింగ్

కలెక్టరేట్, డబ్ల్యూజీఎంసీ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుల కోసం వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డు ద్వారా గతంలో పొందిన ప్రయోజనాలు ఇప్పుడు వృద్ధులు పొందలేకపోతున్నారనీ, అందువల్ల ఈ కార్డులు ఉన్నా లేకున్నా ఒకటే అనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తోంది. అయితే రైల్వే, ఆర్టీసీ వంటి రవాణాకు గతంలో లాగా ఇప్పుడు ప్రయాణ చార్జీల్లో రాయితీలు ఇవ్వడం లేదు. 58 ఏళ్ల పైబడిన మహిళలు, 60 ఏళ్ల దాటిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం టికెట్ ధరలో రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చిలో ఈ వెసులుబాటును నిలిపివేసిన రైల్వే శాఖ పునరుద్ధరించలేదు. కానీ మిగతా ప్రయోజనాలు యథాతథంగానే ఉన్నాయి. అలాంటప్పుడు కార్డుల జారీని నిలిపివేయడం ఎందుకు ? అని వృద్ధులు ప్రశ్నిస్తున్నారు. సీనియర్ సిటిజన్లు అని ధ్రువీకరించుకోవడానికి ఆధార్ కార్డు సరిపోతుందని, వాటి ఆధారంగా సీనియర్ సిటిజన్ కార్డు ప్రయోజనాలను పొందవచ్చునని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం సీనియర్ సిటిజన్ కార్డు ఉండాల్సిందేనని చెబుతున్నారని వయోవృద్ధులు వాపోతున్నారు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం లేక..

కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదని మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు. వెబ్‌సైట్‌లో ఫ్యామిలీ కార్డు వరకు అప్లికేషన్ వెళ్తున్నా కార్డు డౌన్‌లోడ్ చేస్తుంటే ఎర్రర్ అని వస్తోందని చెబుతున్నారు. మాన్యువల్ అయితే చిరునామా ఎక్కడ ఉంటుందో అక్కడి మండల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కార్డులను ఉచితంగా జారీ చేస్తుండగా తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది.



వైద్య సాయం

వృద్ధులకు ఆరోగ్య భరోసాను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన' (ఏబీ-పీఎంజేఏవై) పథకాన్ని ప్రారంభించింది. వార్షిక సంపాదనతో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 5 లక్షల బీమా అందిస్తారు. ఎస్‌సీసీ పొందిన వారికి సంవత్సరానికి కనీసం రూ. 5 లక్షల మేరకు వైద్యసాయం అందుతుంది. రాష్ట్రంలో ఈ కార్డుల జారీ లేక ఆ అవకాశాన్ని వయో వృద్ధులు కోల్పోతున్నారు.

ప్రయోజనాలెన్నో..

సీనియర్ సిటిజన్ కార్డుతో సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చు. వయసు ధ్రువీకరణ, ఆధార్, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ఆర్టీసీ బస్ టికెట్‌లో 25 శాతం రాయితీ లభిస్తుంది. కేసుల విచారణలో కోర్టులు ప్రాధాన్యం ఇస్తాయి. బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక లైన్లు ఉంటాయి. పన్ను మినహాయింపులూ ఉంటాయి.

మినహాయింపులు

సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 3లక్షల వరకు, 80 ఏళ్ల పైబడిన వారికి రూ. 5 లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపు లభిస్తుంది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు వడ్డీ రూపంలో వచ్చే ఆదాయంపై రూ. లక్ష వరకు టీడీఎస్ మినహాయింపు పరిమితి వర్తిస్తుంది. జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం వంటి వాటి కింద పెన్షన్ పొందవచ్చు. పలు విమానయాన సంస్థలు సీనియర్ సిటిజన్లకు ప్రయాణ చార్జీల్లో డిస్కౌంట్లు ఇస్తున్నాయి. సీనియర్ సిటిజన్లు బ్యాంకుల్లో తీసుకునే వ్యక్తిగత రుణాలకు 1 నుంచి 1.5 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది. సీనియర్ సిటిజన్ పొదుపు పథకం కింద 60 ఏళ్ల దాటిన వృద్ధులు చేసిన డిపాజిట్లపై బ్యాంకులు 8.2 శాతం వడ్డీ ఇస్తాయి.

ఉమ్మడి జిల్లాలో 19,800 కార్డులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల వరకు 19,800 సీనియర్ సిటిజన్ కార్డులు జారీ అయ్యాయి. హనుమకొండ జిల్లాలో 4,200 ఎస్‌సీసీలు జారీ అయ్యాయి. వరంగల్ జిల్లాలో 4,050, జనగామ జిల్లాలో 3,900, మహబూబాబాద్‌లో 4,350, ములుగులో 1,600, భూపాలపల్లి జిల్లాలో 1,700 కార్డులు జారీ అయ్యాయి.

సీనియర్ సిటిజన్స్ కార్డులు జారీ చేయాలి



వయోవృద్ధులకు ఎన్నో ప్రయోజనాలు అందించే సీనియర్ సిటిజన్ కార్డుల జారీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయం. ఆధార్‌కార్డు ఎలాగూ ఉందన్న కారణంతో సీనియర్ సిటిజన్ కార్డు అవసరం లేదని నిలిపివేయడం సరికాదు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్డులు జారీ అవుతుండగా ఇక్కడ మాత్రం రద్దు చేయడం దారుణం. గతంలో మాదిరిగానే సీనియర్ సిటిజన్ కార్డులను జారీ చేయాలి. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ప్రభుత్వానికి వినతి పత్రాన్ని సమర్పించబోతున్నాం.

తేరాల యుగేంధర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

వీధి కుక్కలపై స్పెషల్ డ్రైవ్

- వందకు పైగా కుక్కల పట్టివేత
- చింతగట్టు ఏబీసీ సెంటర్‌కు తరలింపు



వీధి కుక్కలను వాహనంలో తరలిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకునేందుకు బల్దియా సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేశారు. ఒక్క రోజే సుమారు వందకుపైగా వీధి కుక్కలను పట్టుకుని చింతగట్టు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)కు తరలించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పిక్కలు పీకుతున్న వీధి కుక్కలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ స్పందించి బల్దియా వెటర్నరీ విభాగం అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. జీడబ్ల్యూఎంసీ వెటర్నరీ అధికారి గోపాల్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో స్వతంత్ర యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది (బిహార్ యువకులు) ఉదయమే రంగంలోకి దిగారు. సుమారు 20మంది మూడు వాహనాలలో సంచరిస్తూ వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సుమారు వందకుపైగా వీధి కుక్కలను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. పట్టుకున్న వీధి కుక్కలను చింతగట్టులోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)కు తరలించారు. అయితే పట్టుకున్న వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసి పట్టుకున్న చోటనే వదిలివేస్తామని బల్దియా వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. నగరంలో ఇకపై ఎక్కడైనా కోతులు, వీధి కుక్కల సమస్యలు ఉత్పన్నమైతే 97019 99701 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని గోపాల్‌రావు తెలిపారు.

సారథులెవరో!?

(5వ పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవి ఓసీలకు ఇస్తే, వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని కొండా దంపతులు పట్టుబడుతున్నారని సమాచారం. అలాగే దొంతి మాధవరెడ్డి ఈ సారి తన అనుచరులకే డీసీసీ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారని తెలుస్తోంది. దీంతో వరంగల్ డీసీసీ అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా జరుగనుందనే చర్చ సాగుతోంది.

ములుగుపై సూర్య.. జనగామపై ఝాన్సీ నజర్..

కాంగ్రెస్ అధ్యక్ష పదవులపై కీలక నేతలు దృష్టి పెట్టారు. 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుండటంతో కొత్త నియోజకవర్గాలు, పాత నియోజకవర్గాల రిజర్వేషన్లు, సరిహద్దులు మారనుండటంతో డీసీసీ అధ్యక్ష పదవిలో ఉంటే ఎమ్మెల్యే సీటుకు కర్చీఫ్ వేసుకున్నట్లే అనే భావనలో కొందరు సీనియర్ నేతలు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పినపాక అసెంబ్లీ స్థానం నుంచి తన వారసుడిని బరిలోకి దించాలని మంత్రి సీతక్క తీవ్ర ప్రయత్నాలు చేశారు. అప్పట్లో రాజకీయ సమీకరణలతో అవకాశం చేజారింది. అయితే వచ్చే అసెంబ్లీ నాటికి తన వారసుడిని క్రియాశీలక రాజకీయాల్లో ఉంచాలనే లక్ష్యంతో సీతక్క వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌ను కొనసాగించకుంటే సూర్యను డీసీసీ పీఠంపై కూర్చోపెట్టవచ్చుననే చర్చ జరుగుతోంది.

ఇక జనగామ డీసీసీ పదవిపై టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి నజర్ వేశారనే ప్రచారం ఉంది. మొదటి నుంచి జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండాలని ఝాన్సీరెడ్డి భావిస్తున్నారు. అయితే టీపీసీసీ నుంచి వైస్‌ప్రెసిడెంట్ పదవి వచ్చినప్పటికీ తనకు జడ్పీ చైర్మన్ లేదా డీసీసీ అధ్యక్ష పదవుల్లో ఏదో ఒకటి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లుగా సమాచారం. అయితే ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కొనసాగించకపోతే ఝాన్సీరెడ్డికి డీసీసీ అవకాశం దక్కవచ్చుననే ప్రచారం జరుగుతోంది. మరోవైపు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారసుడిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సైతం డీసీసీ అధ్యక్ష పదవిపై కన్నేశారనే చర్చ నెలకొంది.

మానుకోట, భూపాలపల్లి జిల్లా పగ్గాలెవ్వరికో..?

సీఎం సలహాదారుడు, వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లా మహబూబాబాద్‌లో డీసీసీ అధ్యక్ష పదవిపై పలువురు నేతలు కన్నేశారు. ప్రస్తుత అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లుగా సమాచారం. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌కు సేవలు అందిస్తున్న భరత్‌చంద్రారెడ్డికి ఏదైనా నామినేటెడ్ పదవిని ఇస్తే.. మరొకరికి డీసీసీ అధ్యక్ష పదవికి లైన్‌క్లియర్ అవుతుందని చర్చ జరుగుతోంది. అలాగే కాంగ్రెస్ యువనేత, వేం నరేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న వెన్నం శ్రీకాంత్‌రెడ్డి పేరు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే జడ్పీ చైర్మన్‌గా శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం ఇస్తే.. డీసీసీ రేసు నుంచి తప్పుకుంటారని సమాచారం. అలాగే బీసీలకు అవకాశం ఇవ్వాలని మహబూబాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య కోరుతున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు ముగ్గురు కూడా మానుకోట హస్తం పగ్గాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇక ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత జిల్లా భూపాలపల్లి డీసీసీ అధ్యక్ష పదవి ఉత్కంఠగా మారింది. ప్రస్తుత అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు అనుచరుడే. ప్రకాష్‌రెడ్డికి కార్పొరేషన్ పదవి రావటంతో డీసీసీ అధ్యక్ష పదవికి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు పేరు తెరపైకి వస్తోంది. అయితే ప్రస్తుత అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డితో పాటు గ్రంథాలయ చైర్మన్ పదవికి కూడా మంథని నియోజకవర్గానికే దక్కింది. మరోసారి డీసీసీ అధ్యక్ష పదవి కూడా శ్రీధర్‌బాబు నియోజకవర్గానికే దక్కితే, తమ పరిస్థితి ఏమిటని భూపాలపల్లి నియోజకవర్గ నేతలు ప్రశ్నిస్తున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ప్రధాన అనుచరుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి, మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ పేరు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. అశోక్‌తో పాటు చల్లూరి మధు కూడా డీసీసీ పదవికి దరఖాస్తు చేయమని అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చినట్లుగా సమాచారం. అలాగే ప్రముఖ వ్యాపారి ఎస్.సంపత్‌రావు (ఎస్ఎస్ఆర్) పేరును కూడా అధిష్ఠానం పరిశీలిస్తోందనే చర్చ జరుగుతోంది.

కరాటేలో అక్కాతమ్ముళ్ల ప్రతిభ

- గిన్నిస్ బుక్‌లో ఆసియా, ఇర్ఫాన్‌కు చోటు
- అభినందించిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఆసియా, ఇర్ఫాను అభినందిస్తున్న ఎంపీ కడియం కావ్య

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'ద వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఐబీఈటీ కళాశాల మైదానంలో నిర్వహించిన కరాటే ప్రదర్శనలో ఓరుగల్లులోని ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ఎం.డి. ఆసియా, ఎం.డి. ఇర్ఫాన్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని సుమారు 4గంటలుగా ఏకధాటిగా పంచెస్, కటాస్‌తో పాటు కరాటేలో ప్రదర్శనలు చేయడంతో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ద వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాస్టర్ బాలమురుగన్ పర్యవేక్షణలో జరిగిన ప్రదర్శనకు లండన్ దేశానికి చెందిన గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ అధికారి రిషినాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ క్రమంలో శుక్రవారం ఆసియా, ఇర్ఫాన్‌లు తమ కుటుంబసభ్యులతో హనుమకొండలోని వరంగల్ ఎంపీ కడియం కావ్యను, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆసియా, ఇర్ఫాన్‌కు పూల బొకేలు అందించి, శాలువాలతో సన్మానించారు. కఠోర శ్రమ ద్వారా ఆసియా, ఇర్ఫాన్‌లు ఘనత సాధించి జిల్లా, రాష్ట్రకీర్తిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. కాగా, వరంగల్ కొత్తవాడకు చెందిన ఆసియా ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ మైనారిటీ గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సం చదువుతోంది. అదే విధంగా ఇర్ఫాన్ కొత్తవాడలోని ప్రైవేటు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు ఆసియా, ఇర్ఫాన్ తల్లిదండ్రులు యాస్మిన్ సుల్తానా-నయీంపాషా, కరాటే మాస్టర్లు, సీనియర్ క్రీడాకారులు, హర్షం వ్యక్తం చేశారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ సతీష్‌బాబు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు, మరో మైనర్ విద్యార్థితో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేశామని పరకాల ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం ఆత్మకూరు మండలం కటాక్షపురం గ్రామంలోని చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో పోలీసులను చూసి ద్విచక్రవాహనంపై పారిపోతుండగా సీఐ సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లు వెంబడించగా పాశం ప్రణీత్, ఇంటర్ విద్యార్థిని పట్టుకున్నారు. ఇందులో మరో వ్యక్తి మున్నీసాయి తప్పించుకుని పారిపోయాడన్నారు. గ్రామస్థుల సమక్షంలో విచారించగా మండలంలోని గూడెప్పాడ్ రామాలయంలో చోరీకి పాల్పడి నగదుతో పాటు వెండి జంజరం, రెండు బంగారు పుస్తెలు దొంగిలించినట్టు, అలాగే ముగ్గురు కలిసి దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద గల వైన్స్ వెంటిలేటర్‌కు ఉన్న గ్రిల్స్‌ను పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ. 12వేల నగదు, చిల్లరతో పాటు 10 మద్యం బాటిళ్లను దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. మద్యంబాటిళ్లను తాగినట్లు వారు అంగీకరించారని ఏసీపీ తెలిపారు. గూడెప్పాడ్ రామాలయంలో జరిగిన దొంగతనం చేసిన వాటిలో రూ.1000 నగదు, వెండి జంజరం, రెండు బంగారు పుస్తెలను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

ఇందులో పాశం ప్రణీత్‌ది హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన వ్యక్తి, కాగా, ఇంటర్ విద్యార్థి భీమారంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు, పారిపోయిన యువకుడిని త్వరలో అరెస్టు చేస్తామని ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు కుమారస్వామి, శ్రీనివాస్‌లను పరకాల ఏసీపీ సతీష్‌బాబు అభినందించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సైలు సతీష్, తిరుపతి, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞానంతో అర్థం చేసుకుంటేనే నిజమైన విజ్ఞానం

- భారత లోహ పరిశోధన సంస్థ గౌరవ సభ్యుడు డాక్టర్ సనక్ మిశ్రా
- వరంగల్ నిట్‌లో ఘనంగా 67వ వ్యవస్థాపక దినోత్సవం



డాక్టర్ సనక్ మిశ్రాకు జ్ఞాపికను అందిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన విజ్ఞానాన్ని పొందగలుతామని, మేధోమథనం సాధ్యమవుతుందని భారత లోహ పరిశోధనా సంస్థ (ఐఐఎం) గౌరవ సభ్యుడు డ్టార్ సనక్ మిశ్రా అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో 67వ వ్యవస్థాపక దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మిశ్రా.. భారత ఉపఖండంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా కూడా జ్ఞానం ఎలా పరిణామం చెందిందో వివరించారు. స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బోర్డు సభ్యుడు, రూర్కెల స్టీల్ ప్లాంట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ కూడా డాక్టర్ సనక్ మిశ్రా 'ది హైపోతిసిస్ ఆఫ్ ది హైయారికీ ఆఫ్ నాలెడ్జ్' అనే అంశంపై వ్యవస్థాపక ప్రసంగం చేశారు. వరంగల్ నిట్ తన 67 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక మైలురాళ్లు దాటి దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థగా తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకున్నదన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి నిట్ అసాధారణ ప్రయాణాన్ని వివరించారు. మూడు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలతో ప్రారంభమైన ఈ విద్యా సంస్థ.. నేడు దేశంలోనే అగ్రగామి సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం నిట్‌లో 11 బీటెక్, 26 ఎంటెక్, 5 ఎంఎస్‌సీ, ఎంసీఏ, ఎంబీఏ, బీఎస్‌సి బీఎడ్, సమగ్ర ఎంఎస్‌సీ కోర్సులు బోధిస్తున్నట్టు తెలిపారు. తాజాగా పునర్విచించిన పాఠ్యక్రమం, స్వయం అభ్యాసం, ఆవిష్కరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణ్యమైన నైపుణ్యాల పెంపుపై దృష్టిసారించినట్టు తెలిపారు. 8వేలు మంది విద్యార్థులు, 700 మంది అధ్యాపకులు, సిబ్బంది, అలాగే 42,600 మందికిపైగా పూర్వ విద్యార్థులతో బలమైన నెట్‌వర్క్‌ను నిట్ కలిగి ఉందన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో అధ్యాపకులు 884 జర్నల్ పేపర్లు, 350 కాన్ఫరెన్స్ పేపర్లు, 127 పుస్తక అధ్యాయాలు ప్రచురించి, 95 జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నదని, అలాగే వివిధ పరిశోధనలపై 25 పేటెంట్లు పొందిందని పేర్కొన్నారు. నిట్‌కు రూ.45.65కోట్ల విలువైన పరిశోధనా నిధులు అందాయని చెప్పారు. నిట్‌లో 81.3 శాతం ప్లేస్‌మెంట్ రేటు సాధించిందని, అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ.64లక్షలుగా నమోదైందని, ఆరు బీటెక్ కార్యక్రమాలు జూన్ 2028 వరకు ఎన్‌బీఏ టియర్-1 గుర్తింపు పొందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వరంగల్, హైదరాబాద్ అలుమ్ని చాప్టర్ల సభ్యులు పాల్గొన్నారు.

వేయి స్తంభాల గుడిలో సంకటహర చతుర్థి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో శుక్రవారం సాయంత్రం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఉత్తిష్ఠ గణపతికి మూలమంత్ర యుక్తంగా పంచామృతాభిషేకం, నారికేళ జలాభిషేకం, కుంకుమ హరిద్రా లేపన అభిషేకం నిర్వహించారు. జిల్లేడు దండలతో అర్చనాది కార్యక్రమాలు నిర్వర్తించారు. నివేదన నీరాజన మంత్ర పుష్పముల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైదిక బృందం గంగు ఉపేంద్రశర్మ, పెండ్యాల సందీప్ శర్మ, గంగు మణికంఠ శర్మ, ప్రణవ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ బంగారం.!

- తులం రూ.1.27 లక్షలు
- సగానికి పడిపోయిన విక్రయాలు
- పెరుగుతున్న ధరలతో ధనవంతుల్లో ఉత్సాహం
- మధ్య తరగతి వర్గాల్లో కలవరం

కేసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ద్రవ్యంగా పేరున్న బంగారం ధర రోజురోజుకూ పెరుగుతూ అంతనంత ఎత్తుకు వెళ్లి మరింత ఎగబాకుతుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కలవరపడుతున్నారు. నిత్యం బంగారం ధర పెరుగుతూ రోజుకో రికార్డు నెలకొల్పుతోంది. ప్రస్తుతం తులం బిస్కెట్ బంగారం రూ.1.27లక్షలుగా ఉంది. గత నాలుగు నెలల క్రితం రూ.70వేల నుంచి రూ.80వేల వరకు ఉన్న బంగారం ధర మూడు నెలలుగా క్రమంగా పెరుగుతోంది. ఆగస్టు రెండోవారంలో తులం బంగారం ధర రూ.1లక్ష దాటడంతో అంతా అవాక్కయ్యారు. ఆ తర్వాత గత 20 రోజులుగా వేగంగా పెరుగుతూ తాజాగా తులం బంగారం రూ.1.27లక్షలకు చేరింది. అంతర్జాతీయ ఆర్థిక అస్థిరత, యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలతోపాటు పలు కారణాలతో బంగారం ధరలు వేగంగా పెరుగుతున్నట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందనే అంచనాలతో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూసే వారిలో ఈ ధరల పెరుగుదల మరింత ఉత్సాహాన్ని పెంచుతూ కొనుగోలు చేస్తున్నారు. ధనవంతులు బంగారం ఖరీదులు మరింత చేస్తుండగా పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి



వర్గాలు పసిడిని కొనడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామీణుల్లో కలవరం..

గ్రామీణ ప్రాంతాల్లో పంట ఉత్పత్తులు విక్రయించిన అనంతరం పెట్టుబడులు పోను మిగిలిన సొమ్ముతో చాలా మంది రైతులు తమ కుటుంబీకుల కోసం బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారు. సుస్థిర ద్రవ్యత్వం కలిగి ఆపద సమయంలో ఆదుకుంటుందని, భవిష్యత్తు అవసరాల కోసం బంగారం కొనిపెట్టుకోవడం చాలా మంది రైతులు, గిరిజన కుటుంబాల్లో ఏటా జరుగుతుండేది. గతంలో తులం బంగారం కొనగలిగే స్థోమత ఉన్నవారు ఇప్పుడు రెండు, మూడు గ్రాములకే పరిమితమవుతున్నారు. బంగారం ధర కొద్దిరోజులపాటు స్థిరంగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని బంగారం షాపుల్లో పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలకు ఆభరణాలను ఆర్డరు ఇచ్చి మొత్తం ధరలో 10 నుంచి 30శాతం అడ్వాన్సు ఇచ్చేవారు.

తాజా ధరల అనిశ్చితి నేపథ్యంలో ఆభరణాల విలువలో 85 నుంచి 90శాతం అడ్వాన్సు ఇస్తేనే తయారు చేసే పరిస్థితి నెలకొందని పలువురు బంగారం షాపుల యజమానులు చెబుతున్నారు. ఏదేమైనా ధనవంతులు మరింత పెరుగుతుందని ఆశాభావంతో ఉత్సాహంగా బంగారం కొనుగోలు చేస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో మధ్యతరగతి వర్గాల్లో అమ్మాయి పెళ్లిళ్ల చేసే వారు బంగారం ధరలతో గుబులు చెందుతున్నారు.

కొనేటట్లు లేదు...

- కొమ్ము రజని, కేసముద్రం




బంగారం ధర వింటేనే గుండెగుబేలుమంటోంది. తులం రూ.1లక్ష అంటే ఎక్కువ అనుకున్నాం. మరింత పెరుగుతూ రూ.1.27లక్షలతో మధ్యతరగతి వర్గాలకు బంగారం అందనంత ఎత్తుకు చేరింది. పెళ్లిళ్ల చేసే వారు బంగారం కొనుగోళ్లకే అధికంగా వెచ్చించాల్సివస్తోంది.

ధర అడిగి.. లెక్క చేసుకొని వెళ్తున్నారు..

- వేణుగోపాలాచారి, బంగారం షాపు యజమాని, కేసముద్రం స్టేషన్



బంగారం ధర అడిగి...లెక్క చేసుకొని అంత డబ్బు పెట్టలేక కొనకుండా వెళుతున్నారు. పెరిగిన ధరలతో గిరాకీ పూర్తిగా పడిపోయింది. శుభకార్యాలకు వెండిపట్టీలు, బంగారు కమ్మలు పెట్టినవారు ధర అడిగి అంతపెట్టలేమని, నగదును కట్నంగా చదివిస్తాం అంటూ వెళ్లిపోతున్నారు. పెళ్లిళ్లకు ఐదు తులాలు కొనేవారు రెండు తులం, నాలుగైదు వస్తువులు చేయించే వారు ఒకటి, రెండు తయారు చేయించుకుంటున్నారు.



సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలి

ములుగు టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సీజేఐ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల బాధ్యులు రత్నం ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ సెంటర్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన రాకేష్ కిశోర్‌ని, అతడిని ప్రోత్సహించిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కలువాల రవీందర్, ములుగు మండల నాయకులు కొర్ర రాజు, సాంబయ్య, కొడపాక చంటి, చందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ బీసీల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ములుగులో శుక్రవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ సమాజం ఆత్మగౌరవం దెబ్బతినేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టు స్టే విధించడం కాంగ్రెస్‌పార్టీ నాటకంలో భాగమేనని, కేవలం రాజకీయ నాటకం తప్ప మరేమీలేదని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అని చెప్పి కోర్టు స్టే వచ్చేలా చట్టపరమైన లోపాలతో సరిదిద్ది ఇచ్చిన మాట ప్రకారం బీసీ రిజర్వేషన్ అమలుచేస్తున్నానని ప్రచారం చేసుకుని, అభ్యర్థుల రిజర్వేషన్ ప్రకటించి, నోటిఫికేషన్ సైతం ఇచ్చి నామినేషన్లను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని సవాల్ చేస్తూనే స్టే విధించడం సిగ్గుచేటని, సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, నాయకులు తిరుపతిరెడ్డి, గాదం కుమార్, మార్క సతీష్, కాసర్ల సురేష్ పాల్గొన్నారు.

బీజేపీపై నిందలు వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

ఏటూరునాగారం : ఖాన్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్ మాదిరిగా వ్యవహరిస్తుదని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు ఆరోపించారు. బీజేపీ పార్టీపై నిందలు వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్‌గా పనిచేస్తున్న జాజుల శ్రీనివాస్‌కు విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు దిమ్మతిరిగేలా చేసిందన్నారు. ఈ సమావేశంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, దళిత మోర్చా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శి కర్నె సంపత్, ఉపాధ్యక్షులు దుర్గం దుర్గారావు, తాళ్లడ రమేష్, గడిగే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతనిధి రామరాజు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాటారం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):కాటారం మండల కేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కాటారం డివిజన్ పరిధిలోని కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాటారం ఏడీఈ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5మండలాల పరిధిలోని అన్ని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏడీఈ పేర్కొన్నారు.

●గోవిందరావుపేట : పస్రా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా పస్రా సబ్‌స్టేషన్ పరిధిలోని పస్రా, ప్రాజెక్టునగర్, మొద్దులగూడెం, కోటగడ్డ ప్రాంతాలకు కరెంటు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఈవిషయాన్ని ప్రజలు, రైతులు, వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి మడిపెల్లి శ్యాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని జరిగిన జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశానికి జిల్లా సీనియర్ నాయకుడు నోముల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా శ్యాంబాబు హాజరై మాట్లాడారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణిస్తూ 13న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పిలుపు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కుక్కమూడి కుమార్, రాజేందర్, సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షపదవికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13న భూపాలపల్లి జిల్లాకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం వస్తున్నారని తెలిపారు. కాగా జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీపడే వారు వారి అర్హతలు పేర్కొంటూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు సమర్పించాలని కోరారు.

కాటారంలో ఆగ్మాంట్ గోల్డ్ బ్రాంచ్ ప్రారంభం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్

కాటారం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):కాటారం డివిజన్ కేంద్రంలో ప్రముఖ ఆగ్మాంట్ గోల్డ్‌టెక్ కంపెనీ బ్రాంచ్ శుక్రవారం ప్రారంభమైంది. బంగారంపై రుణాలు అందించడానికి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన ఆగ్మాంట్ గోల్డ్ విస్తరణలో భాగంగా డివిజన్ కేంద్రమైన గారెపల్లిలో పోటు సురేష్ మేనేజర్‌గా గోల్డ్‌లోన్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయగా కంపెనీ జనరల్ మేనేజర్ శామ్యూల్‌రాజ్, ఏజీఎం కాశీనాథ్, జీఎం వర ప్రసాద్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది విడదవేని శ్యాంసుం దర్, బండం అంజయ్య, గుర్రం సుధాకర్, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి నేతల చేయూత

కాటారం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రానికి చెందిన పంతకాని వినయ్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబాన్ని మాల మహానాడు నాయకులు శుక్రవారం పరామర్శించారు. జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి కందుగుల రాజన్న ఆధ్వర్యంలో పలువురు నేతలు వినయ్ కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం, బియ్యం, సరుకులు అందించారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, కుమార్‌యాదవ్, భూపెల్లి రాజు, గడ్డం కొమురయ్య, కుమ్మరి రమేష్, రాజేంద్ర ప్రసాద్, రాజబాబు, రమేష్‌బాబు, రాజు, రాజయ్య, మల్లేష్, నడువలి రావు, మల్లిఖార్జున్, చక్రవర్తి, పోచయ్య తదితరులు ఉన్నారు.

ఆయా కుటుంబానికి ఆర్థికసాయం

తాడ్వాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామారం గ్రామనికి చెందిన అంగన్వాడీ ఆయా చర్ప అనసూర్య విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఈ క్రమంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి మృతదేహానికి పూలమాల వేసి నివాళిలు అర్పించారు. ప్రభుత్వ తక్షణ సహాయంగా 10వేల చెక్కును అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

గణపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్, నగరంపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను బీజేపీ మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు గురువారం పరామర్శించారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి, హరిలాల్, చెలుమల్ల ప్రవీణ్, గొర్రె రవి, మల్లయ్య, మొగిలి తదితరులు ఉన్నారు.

● వెంకటాపూర్ : మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఇటీవల మరణించిన రాయబారపు అరుణ్‌కుమార్ కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన అరుణ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టికోళ్ల వెంకటేష్, నాయకులు మేకల రాజేష్, జానపట్ల రాజ్‌కుమార్, బత్తుల గణేష్, పల్లకొండ శ్యామ్, పనికల రాజు, వెంకటస్వామి, బీరెల్లి రవితేజ, బండ నితిన్, రాకేష్, శ్రీను, రాజు, లక్ష్మీనారాయణ, రాజేష్, వంశీ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జనంలోకి కాంగ్రెస్ బాకీకార్డులు

వాజేడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు, నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, మండల అధ్యక్షుడు పెనుమాళ్ల రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ప్రజలకు కాంగ్రెస్ బాకీకార్డులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. నాయకులు పాయం జయలక్ష్మి, పాయం జానకిరమణ, నాంపల్లి లక్ష్మి, నారాయణ, నాగరాజు, సంజీవరాణి, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు బీసీలంటే ఇష్టం లేదు..

తాడ్వాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఇష్టం లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సీనియర్ నాయకుడు బొల్లు రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అదేవిధంగా మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆశాడపు మల్లయ్య, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దుబాసి సుధాకర్ ఇరు పార్టీల నాయకులను విమర్శించారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటా కల్పిస్తే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఓర్చుకోలేక పోతున్నాయని అన్నారు. రిజర్వేషన్ జీవో 9పై హైకోర్టు ఇచ్చిన స్టేతో సీఎం రేవంత్‌రెడ్డి పై విమర్శలు చేస్తు హేలన చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రతి రాజకీయ పార్టీలలో బీసీలు ఉన్నారని అన్నారు. 42శాతం రిజర్వేషన్ అమలు కోసం నాయకులు, కార్యకర్తలు పోరాడాలని తెలిపారు.

● ఏటూరునాగారం : గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన చట్టమే నేడు బీసీల రిజర్వేషన్ల తగ్గింపునకు, అన్యాయానికి దారి తీసిందని ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు తీవ్రంగా ఆరోపించారు. బీసీలకు న్యాయం చేయకుండా అడ్డుకుంటున్నది బీజేపీ, బీఆర్ఎస్ నేతలే అని ఆయన విమర్శించారు. శుక్రవారం మండలంలోని రొయ్యూర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఈ విషయాలపై రఘు మాట్లాడారు.జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దేవులపల్లి విజయ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి సోదారి హరీష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుదురుపాక శ్రీనివాస్, కావిరి మొండయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సింగరేణి సిగలో మహిళా శక్తి..!

(5వ పేజీ తరువాయి)

ఇతర శాఖలతో పోలిస్తే సింగరేణిలో పని భారం ఉంటుందనే భావన నెలకొంది. అలాంటివన్ని పక్కన పెట్టి కష్టంతో కాకుండా సింగరేణిలో చేరిన మహిళలు ఇష్టంతో ముందడుగు వేస్తున్నారు. ప్రధానంగా రెస్క్యూ విభాగం అంటేనే రిస్క్ చేయడం. ఒక్కోసారి ఈ రంగంలో అందించే సేవలతో పురుషులే సతమతమవుతుంటారు. అలాంటి రెస్క్యూ విభాగంలో చేసేందుకు సైతం ఏరియాలో పలువురు మహిళలు ముందుకొచ్చారు. భూపాలపల్లి రెస్క్యూ విభాగంలో ప్రస్తుతం ఏడుగురు మహిళలు రాణిస్తున్నారు. ఏదైనా ప్రమాదం, విపత్తులు జరిగిన సందర్భంలో వేగంగా పని చేయడం, ప్రాణాలు కాపాడటం, చాకచక్యంగా వ్యవహరించి నష్టాన్ని నివారించడం రెస్క్యూటీమ్ బాధ్యత కాగా.. వీరంతా మెరుగైన శిక్షణ పొంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కాలంలో వీరు రాణిస్తున్న ప్రతిభకు గానూ వీరిలో నలుగురు నేషనల్ లెవల్ పోటీలకు సైతం ఎంపికయ్యారు. వచ్చే నెల నవంబర్ 4న నాగ్‌పూర్‌లో జరగబోయే కాంపిటేషన్‌లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు సింగరేణిలో ఒకింత కీలకమైన విభాగం సెక్యూరిటీ విభాగం. ఈ విభాగంలో పని చేయాలంటే నిరంతరాయంగా అప్రమత్తంగా ఉండాలి. సింగరేణిలోని ఆస్తులను కాపాడటంతో పాటు భద్రతా పరమైన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ విభాగంలో కూడా తామేమి తక్కువ కాదని ముందుకొచ్చిన 10 మంది మహిళలు సెక్యూరిటీగార్డులు పని చేస్తున్నారు. వీరికి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ నేతృత్వంలో ఫిట్‌నెస్‌లో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వగా ఈ విభాగంలో అధికారులు ఆశించిన కంటే ఎక్కువగానే విధుల్లో అంకిత బావాన్ని ప్రదర్శిస్తున్నారు.

- హెవీ వెహికల్ నడపడానికి ఆహ్వానం..

సింగరేణిలో ఎన్నడూ లేని విధంగా మహిళలను సింగరేణిలోని అన్ని రంగాల్లో భాగస్వామ్యం చేయాలని సంస్థ భావిస్తోంది. ఇందులో భాగంగా సింగరేణి సీఎండీ ఆదేశానుసారం ఓపెన్‌కాస్టుల్లోని హెవీ వెహికిల్స్ నడపడానికి ఆసక్తి గల మహిళల నుండి దరఖాస్తులను ఆహ్వానాన్ని పలికింది. ఈ ప్రక్రియ ప్రారంభం కాగా..వచ్చే నెల 13వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. 7వ తరగతి ఉత్తీర్ణులై, 35 సంవత్సరాలలోపు వారు.. శారీరక సామర్థ్యం, టూవీల్లర్, ఫోర్ వీలర్ లైసెన్సు ఉన్న వారు అర్హులని ఉత్తర్వులు జారీ అయ్యాయి. టూ, ఫోర్ లైసెన్సులు ఉన్న వారికి హెవీ లైసెన్సు ఇప్పించి సిరిసిల్లలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వెంకటాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కళ్యాణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలుబాక గ్రామంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరగగా ఆయన పాల్గొని 42మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న వారినుంచి రక్తనమూనాలు సేకరించారు. శిబిరంలో హెచ్‌ఈవో కోటిరెడ్డి, సిబ్బంది ధనలక్ష్మి, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం

ఏటూరునాగారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యమని రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని శంకరాజుపల్లి గ్రామంలో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన క్రీడాకారులకు వాలీబాల్, నెట్‌ను అందజేశారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కుంజా సూర్య సూచనల మేరకు ఈ క్రీడా సామగ్రిని అందజేశామని తెలిపారు. అనంతరం క్రీడలను ఆయన ప్రారంభించారు. తాటి నీలాద్రి, పొలం వెంకటేష్, గడబోయిన రంజిత్, అత్కూరి నేతాజీ, గడిగా శ్రీకాంత్, తోలేం అర్జున్, గోడు ముకుందరరావు, పొలం సురేష్, నగేష్‌తోపాటు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కల్పించాలి



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

గోవిందరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చాపూర్, గోవిందరావుపేట గ్రామాల శివారుల్లోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు రక్షణ కల్పించాలని బాధిత రైతులు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. కొన్నిరోజులుగా ఆయా గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై కన్నేసిన దొంగలు వాటిని ధ్వంసంచేసి కాపర్‌వైరు, ఆయిల్‌ను చోరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున మచ్చాపూర్‌కు చెందిన రైతు దరిపెల్లి సమ్మయ్య పంట పొలంలో ఉన్న 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లి కాపర్‌వైరు, ఆయిల్ చోరీకి పాల్పడ్డారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయని, తమ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కల్పించాలని బాధిత రైతులు పోలీసులను కోరుతున్నారు.

చల్లగరిగ మాజీ సర్పంచ్ మృతి



నరసింహారెడ్డి (ఫైల్)

చిట్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లగరిగ గ్రామ మాజీ సర్పంచ్ కర్రె నరసింహారెడ్డి(88) అస్వస్థతకు గురై గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరసింహారెడ్డి 1981-86 లో గ్రామసర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా గత 30 ఏళ్లుగా కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నివసిస్తున్నారు. కొద్దికాలంగా అనారోగ్యానికి గురైన నరసింహారెడ్డి మృతితో చల్లగరిగలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

మల్హర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ మంజూరు పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతె మరమ్మత్తులకు కాటారం, రేగొండ, చిట్యాల, జంగేడు వెళ్లాల్సి వచ్చేది. రైతులు పడుతున్న కష్టాలను కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకొని వెళ్లారు. మంత్రి అధికారులతో మాట్లాడి సెంటర్ మంజూరు చేయించినట్లు మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు తెలిపారు. మంత్రి రైతుల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విపత్తులు, అగ్ని ప్రమాదాలపై అవగాహన

తాడ్వాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాంపాక ఐలయ్య, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అగ్ని మాపక శాఖ అధికారులు విద్యార్థులకు పకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక శాఖ అధికారి చల్లగొండ రవికుమార్ విద్యార్థులకు విపత్తులలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది శ్రీకాంత్, ప్రవీణ్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, కిషన్, పాల్గొన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి చేయించాలి

వెంకటాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 గ్రామపంచాయతీలలో 100రోజుల ఉపాధిహామీ పథకానికి సంబంధించి జాబ్‌కార్డులు కలిగిన వేతన కార్మికులు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలన ఏపీవో మాలోత్ రాజు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని లక్ష్మీదేవిపేట ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి ఈ-కేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించుకోని కూలీలు ఇకపై పనులకు హాజరుకావడం, పనులు పొందడం సాధ్యం కాదని అన్నారు. మండలంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తమ గ్రామపంచాయతీకి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఈ-కేవైసీ అప్లికేషన్ పూర్తి చేయించుకోవాలన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్టే ఇవ్వడంపై నిరసన



నిరసన చేస్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. బైక్‌లపై ర్యాలీ చేస్తూ దుకాణాలను మూసివేయాలని కోరారు. అలాగే బీసీలకు అన్యాయం చేయాలని చూడడం సరైంది కాదని ఆ పార్టీ జిల్లా నాయకుడు రవి పటేల్ అన్నారు. దీనికి కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీలు బాధ్యత వహించాలని అన్నారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రధానరోడ్డును దిగ్బంధం చేయగా పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, చంద్రశేఖర్, శ్రీను, వెంకన్న, సమ్మయ్య, నవీన్, అక్షయ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

● ములుగు టౌన్ : బీసీలకు 42 శాతం అమలుకు అడ్డుపడుతుంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులేనని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి. చాంద్‌పాషా ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, స్థానిక ఎన్నికల్లో వాటా కల్పిస్తే ఓర్చుకోలేని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ పై నిందమోపడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొడాల ఓంప్రకాష్, నాయకులు భరత్, ఓడ రాజు, మామిడిశెట్టి కోటి, గుంటోజు శంకర్, కంబాల రవి, వంశి, దేవ్‌సింగ్, నాగరాజు, మాదారపు రాజు, పిట్టల రాధిక, మైనారిటి నాయకులు సయ్యద్ షకీల్ హమ్మద్, హాజీపాషా, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్